క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం


స్వాగతం పలుకుతున్న నేతలు

చేర్యాల(సిద్దిపేట): విదేశీ పర్యటన ముగించుకుని స్వదేశానికి తిరిగివచ్చిన జనగామ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య సోమవారం ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట పలువురు పట్టణ, మండల నాయకులు ఉన్నారు.

సప్లిమెంటరీలో ప్రథమ స్థానం


శ్రావణి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో లింగారెడ్డిపల్లి కాలనీకి చెందిన శ్రావణి జిల్లాలో ప్రథమ స్థానం సాధించింది. ప్రతిమ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఆమె సోమవారం వెలువడిన ఫలితాలలో 500 మార్కులకు గాను 486 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోటగిరి ప్రభాకర్, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కలిసిన సురేష్


మంత్రి బండి సంజయ్‌తో సురేశ్


చేర్యాల(సిద్దిపేట): పార్లమెంట్ సభ్యుడిగా ప్రమాణం చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఢిల్లీలోని ఆయన నివాసంలో మండల పరిధిలోని వేచరేణి గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేశ్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యేల దిష్టిబొమ్మల దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

బెజ్జంకి(సిద్దిపేట): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజీవ్‌కుమార్‌ల దిష్టిబొమ్మలను సోమవారం బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బిగుల్ల మోహన్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల తీర్పును అగౌరవపరిస్తే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో దేవయ్య, బాలనర్సు, బాబు, తిరుపతి, బీడీ సుదర్శన్, శ్రీను, మధు, బాబుమియా తదితరులు పాల్గొన్నారు

పుస్తకాల పంపిణీ


పుస్తకాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ రాజన్న విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కళాశాలలో ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, పది పాస్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్టేట్ టాపర్‌గా దుబ్బాక విద్యార్థిని

దుబ్బాక: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన లహరి ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. సోమవారం వెలువడిన ఇంటర్మీడియెట్ ఇంప్రూమెంట్ ఫలితాల్లో ఆమె టాపర్‌గా నిలువగా బి.ప్రవళిక, జి.రుచిత బైపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. ప్రిన్సిపాల్ భాస్కర్‌శర్మ వారిని అభినందించారు.

బస్సుపాస్ ఫారాలు ఇవ్వండి

హుస్నాబాద్: విద్యా సంవత్సరం మొదలైనా విద్యార్థులకు బస్సుపాసుల ఫారాలు ఇవ్వడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. దాదాపు 3వేల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి పాఠశాలలకు వస్తుంటారని, ఆర్టీసీ అధికారుల జాప్యం వల్ల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటే ఆటోలల్లో వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. వెంటనే డిపో మేనేజర్ స్పందించి బస్సుపాస్ ఫారాలు ఇవ్వాలని మల్లేశ్ డిమాండ్ చేశారు.

ఒంటికొస్తే ఇంటికే..

- సంతలో కనీస వసతులు కరువు
- తాగునీరు, మరుగుదొడ్లు లేవు
- పార్కింగ్ స్థలం లేక ట్రాఫిక్ సమస్యలు


మిరుదొడ్డిలో నిర్వహిస్తున్న సంత

మిరుదొడ్డి(దుబ్బాక): అంగట్లో అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని ఉందన్న సామెతలా ఉంది మిరుదొడ్డిలో ప్రతి ఆదివారం జరిగే సంత పరిస్థితి. ఎలాంటి సౌకర్యాలు లేకపోడంతో విక్రయదారులు, వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తై బజార్ పేరుతో పంచాయతీ సిబ్బంది ఒక్కో దుకాణాదారుడి నుంచి డబ్బులు వసూలు చేస్తారు తప్ప కనీస వసతులు కల్పిండంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు నెలకొన్నాయి. సంతలో తాగునీరు, మరుగుదొడ్లు లేవని దుకాణాదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిసర గ్రామాల రైతులు కూరగాయలు, పండ్లు, దుస్తులు, ఎండుమిర్చి, చేపలు, మాంసం లాంటివి తెచ్చి విక్రయిస్తుంటారు. ప్రతి దుకాణాదారుడి నుంచి పంచాయతీ సిబ్బంది రూ.20, రూ.30ల వసూలు చేస్తారు. ప్రతివారం సుమారు 500పైగా దుకాణాలు పెట్టుకుంటారు. అంటే పంచాయతీకి ప్రతివారం సుమారు రూ.10వేల నుంచి రూ.15వేలు వరకు ఆదాయం సమకూరుతుందని అంచనా.

మరుగుదొడ్లు లేక..

సంతకు వచ్చిన వారు మౌలిక వసతులులేక నానాఅవస్థ పడుతున్నారు. ఇక మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తమది ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితి అని మహిళలు వాపోతున్నారు. పురుషులైతే తమ అవసరాలను తీర్చుకోవడానికి సుమారు రెండు మూడు కిలోమీటర్లు వెళ్తున్నారు. తమ నుంచి డబ్బులు వసూలు చేయడమే కాదు, కనీస వసతులు కూడా సమకూర్చాలని దుకాణాదారులు డిమాండ్ చేస్తున్నారు.


ఇబ్బందికరంగా మారిన పార్కింగ్

ఇబ్బందులు తొలగించాలి


తైబజారు పేరుతో ఒక్కో దుకాణం నుంచి డబ్బులు వసూలు చేస్తున్న అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో దూరంగాపోయి అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోంది. కనీస సౌకర్యాలు కల్పించి ఇబ్బందులను తొలగించాలి.
– సత్తిరెడ్డి, దుకాణాదారు, చెప్యాల

పార్కింగ్ లేక అవస్థలు


వివిధ ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకు వచ్చే రైతులు, చిరువ్యాపారులకు పార్కింగ్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలిపేయడంతో వినియోగదారులకు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలి. – ఎండీ, హుస్సేన్, మాజీ కో–ఆప్షన్ మెంబర్, మిరుదొడ్డి

స్థానికులు సహకరించాలి


ప్రతివారం జరిగే సంతలో ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమే. అయితే చుట్టుపక్కల ఉన్న వాళ్లు అభ్యంతరం చెబుతుండడంతో మరుగుదొడ్లు నిర్మించలేక పోతున్నాం. స్థానికులు సహకరిస్తే నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం.
– గంగుల గణేశ్‌రెడ్డి, ప్రత్యేక పాలనాధికారి, ఎంపీడీఓ, మిరుదొడ్డి

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష ప్రారంభం

పరిశీలించిన అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో టీజీపీఎస్సీ నిర్వహిస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ నియామక పరీక్ష సోమవారం ప్రారంభమైంది. మొదటి రోజు రెండు సెషన్‌లలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించారు. తొలి సెషన్‌కు 100మందికి 67 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 నుంచి 5 వరకు నిర్వహించిన రెండో సెషన్‌కు 100 మందికి 67 మంది హాజరయ్యారు. మొత్తం 66 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ తీరును అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ పరిశీలించారు. పరీక్షలు ఈ నెల 29 వరకు జరగనున్నాయి.


పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అడిషినల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, అబ్జర్వర్ వేణుగోపాల్ రావు, టీసీఎస్ ఆఫీసర్ సాయిలీల, పీఆర్వో రఘు, సిస్టం అడ్మిన్ షాదుల్లా తదితరులు పర్యవేక్షించారు.

తహసీల్దార్‌పై బాధితుల ఫిర్యాదు

చిన్నకోడూరు(సిద్దిపేట): తమ కాలనీకి చెందిన 20గుంటల భూమిని ఇతరుల పేరు మీద మార్చేందుకు తహసీల్దార్ ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాధితులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండల పరిధిలోని మైలారం పంచాయితీలోని మధిర కొండెంగలకుంట గ్రామానికి చెందిన పుట్ట నర్సయ్య పేరున 2.08గుంటల భూమిని ఐదేళ్ల క్రితం బీసీ కాలనీ పేరున మారిందన్నారు. అందులో 20గుంటల భూమి కమ్మర్లపల్లి గ్రామానికి చెందిన గాజుల కిష్టయ్య పేరున మార్చడానికి తహసీల్దార్ జయలక్ష్మి కలెక్టర్‌కు ప్రపోజల్ పంపారని, ఆమెను నిలదీయగా ఆ భూమని త్వరలోనే బీసీ కాలనీ పేరున మార్చుతామని హామీ ఇచ్చారని చెప్పారు. అయినప్పటికీ మార్చకపోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అయినా విచారణ చేపట్టలేదని వాపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని సముదాయించి ధర్నా విరమింపజేశారు. అనంతరం బాధితులు తహసీల్దార్ జయలక్ష్మిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.


ధర్నా నిర్వహిస్తున్న బాధితులు

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యార్థులు బాల్యం నుంచే క్రీడలతోపాటు క్రమశిక్షణ, చదువుపై శ్రద్ధ వహిస్తే భవిష్యత్తులో రాణిస్తారని హెచ్ఎం జ్యోతి అన్నారు. అక్కన్నపేట మండలం గౌరవెల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రాంతీయ క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు 27నుంచి 30వరకు జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 60మంది బాలురు, 60మంది బాలికలను ఎంపికచేసి శిక్షణ నిర్వహిస్తామని చెప్పారు. పోటీల మండల కన్వీనర్ వెంకటనర్సయ్య, ఉపాధ్యాయులు చంద్రారెడ్డి, శ్రీనివాసు, బాబు, ఓం ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎంపిక పోటీలో పాల్గొన్న విద్యార్థులు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

మిరుదొడ్డి(దుబ్బాక): నకిలీ విత్తనాలను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేశం హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన దుకాణాలలోనే నాణ్యమైన విత్తనాలను కొనాలని రైతులకు సూచించారు. విధిగా రసీదులు పొందాలని, దుక్కిలో తగినంత తేమ ఉంటేనే విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. ఏఈఓలను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

ప్రమాద బీమా కల్పించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భవన నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన, గాయపడిన కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీని కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం కోరారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడితే తక్షణ సాయం కింద రూ.5లక్షలతోపాటు కోలుకునే వరకు నెలకు రూ.5వేల సాయం అందించాలన్నారు. సమావేశంలో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు అందడం లేదు

పశువైద్య అంబులెన్స్ సిబ్బంది

గజ్వేల్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్యసేవలందిస్తున్న తమకు సకాలంలో వేతనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. సోమవారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి ఒక 1962 అంబులెన్స్ చొప్పున మూగజీవాలకు వైద్యసేవలు అందిస్తున్నామని, ఈ అంబులెన్స్‌లో వెటర్నరీ డాక్టర్, డ్రైవర్, అటెండర్ తోపాటు మరొకరు విధులు నిర్వహిస్తుంటారన్నారు. గ్రామాల్లో పశువులకు వైద్యసేవలందిస్తూ నిత్యం రైతులకు అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. కొన్ని నెలలుగా తమకు సకాలంలో వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని పశువైద్య అంబులెన్స్ సిబ్బంది కోరారు.



మాట్లాడుతున్న అంబులెన్స్ సిబ్బంది

చిన్నారులకు అర్థమయ్యేలా బోధించండి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రోజాశర్మ

సిద్దిపేటరూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను ప్రారంభిస్తున్న సందర్భంగా శిక్షణ పొందిన టీచర్లు చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ సూచించారు. సిద్దిపేట ఐసీడీఎస్ కేంద్రంలో అంగన్‌వాడీలకు నిర్వహించిన శిక్షణను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పించాలన్నారు. జెడ్పీ సీఈఓ, జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద, సీడీపీఓ రమాదేవి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

దుబ్బాకటౌన్: నాలుగో తరగతిలో ప్రవేశాలకు హైదరాబాద్‌లోని హకీంపేటలో గల క్రీడా పాఠశాలలో అడ్మిషన్‌లకు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు మండల వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యావ్యవస్థను గాలికి వదిలిన ప్రభుత్వం

ఏబీవీపీ నేత ఆదిత్య

హుస్నాబాద్: రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రభుత్వం, విద్యాధికారులు గాలికి వదిలివేశారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సావుల ఆదిత్య ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం మారిందేకాని పరిపాలన విధానం మారలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారని, ఆ దోపిడీని అధికారులు అరికట్టాలని ఆదిత్య డిమాండ్ చేశారు. సమావేశంలో ఏబీవీపీ నగర కార్యదర్శి రాకేష్, రాజేశ్, చరణ్, రాహుల్, రాజు తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

గజ్వేల్‌రూరల్: నూతన జాతీయ విద్యావిధానంలో పిల్లల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా రూపొందించిన పాఠ్య ప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ సరిత మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజులపాటు శిక్షణ ఉంటుందని, ఐసీడీఎస్ గజ్వేల్ ప్రాజెక్టు పరిధిలో 274అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 35 కేంద్రాల ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలో శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. మిగతా 239 మంది ఉపాధ్యాయులను ఆరు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా మండలాల పర్యవేక్షకులు, పోషణ్ అభియాన్ బ్లాక్ కో–ఆర్డినేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


వర్షాల కోసం బోనాలు

మండల పరిధిలోని కమ్మర్లపల్లిలో వర్షాల కోసం గ్రామ దేవతలకు బోనాలు తీశారు. సోమవారం మహిళలు ఇంటి నుంచి బోనాలు తీసుకుని అమ్మవార్లకు సమర్పించారు. ప్రతి యేటా గ్రామ దేవతలకు బోనం సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవార్లను వేడుకున్నారు. – చిన్నకోడూరు(సిద్దిపేట)

పెరుకలగడ్డ పాఠశాలకు అభినందనలు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లి గ్రామ పరిధిలోని పెరకలగడ్డ పాఠశాలలో సమ్మర్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించి పిల్లల అభ్యసన, చిత్రలేఖనం, పేపర్ ఆకృతుల తయారీ, యోగా శిక్షణలో వివిధ సామర్థ్యాలు మెరుగుపర్చినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్, నిర్వాహకులు రోమిల్ల తదితరులు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం హెచ్ఎం రవివర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. శిక్షణ కార్యక్రమం వల్ల విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం మరింత పెరిగిందని హెచ్ఎం వారికి తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో సేవలందించిన వాలంటీర్‌లు దివ్య, అంజలిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాశాఖ అధికారులు

మంత్రిని కలిసిన మెప్మా ఉద్యోగులు

హుస్నాబాద్: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హుస్నాబాద్‌లో మెప్మా ఉద్యోగులు కలిశారు. పేస్కేల్ జీఓ ఎంఎస్ నంబర్ 157ను వెంటనే అమలు చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. అంతక ముందు కరీంనగర్ జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మానకొండూరు జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మెప్మా ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీవాణి, రాజు, అనిత, సునీత, సతీశ్ తదితరులు ఉన్నారు.


మంత్రికి మొక్కను అందజేస్తున్న ఉద్యోగులు

'ఉపాధి' పనుల్లో అక్రమాలు

పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు

గజ్వేల్‌రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో జరిగిన అక్రమాలు చోటు చేసుకోగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు చేసిన తప్పిదాలకు జరిమానాలు విధించిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్‌లో గత యేడాదిలో నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోమవారం సామాజిక తనిఖీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ, జిల్లా విజిలెన్స్ అధికారి ప్రభాకర్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్‌లు సామాజిక విచారణను ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ కృష్ణగౌడ్, ఎంపీడీవో ప్రవీణ్‌ల సమక్షంలో నిర్వహించారు. మండల పరిధిలోని 25గ్రామాల్లో రూ.3,37,89,703 విలువైన పనులను నిర్వహించగా జరిగిన తప్పిదాలను పరిశీలించిన అధికారులు సంబంధిత ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులకు రూ.1,72,755 జరిమానాలు, రికవరీలను విధించారు. అడిషనల్ డీఆర్‌డీవో బాలకృష్ణ, ఎంపీడీవో ప్రవీణ్ మాట్లాడుతూ తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.


విచారణ నిర్వహిస్తున్న అధికారులు

హామీలు అమలు చేయలేక నిందలా?

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆరు గ్యారంటీలలోని 13హామీలను అమలు చేయలేక బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పై నిందలు మోపడమే కాంగ్రెస్ నేతలకు అలవాటైపోయిందని మండిపడ్డారు. పూటకో మాట మాట్లాడుతూ హామీల విషయాన్ని తుంగలో తొక్కారని ఆరోపించారు. రైతుభరోసా పథకాన్ని గాలికొదిలేశారని విమర్శించారు. ఆగస్టు 15లోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీతోపాటు 6గ్యారంటీలలోని 13హామీలను అమలుచేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేడు ఆ బాధ్యత నుంచి తప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నదని, రాబోవు రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు.

బిల్లులు, వేతనాలను విడుదల చేయాలి

సీఐటీయూ జిల్లా నేత రవికుమార్

సిద్దిపేటరూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కార్మికుల వేతనాలే కాకుండా, వారికి చెల్లించాల్సిన బిల్లులను కూడా పెండింగ్‌లో ఉంచడం బాధాకరమన్నారు. బడ్జెట్ లేదని చెబుతూ అధికారులు కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శోభ, బాలనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యార్థినికి బాల రచయిత్రి అవార్డు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని బి.దివ్య బాల రచయిత్రి ప్రోత్సాహక అవార్డును అందుకుంది. బాలల్లో సాహిత్యాభిరుచిని పెంపొందించడానికి జిల్లాస్థాయిలో సుగుణ సాహితీ సమితి సోమవారం కథల పోటీలు నిర్వహించింది. పోటీలలో ఆమె రాసిన 'మీరు కూర్చోండి' అనే కథకు ప్రోత్సాహక బహుమతికి ఎంపికైంది. హైస్కూల్ నుంచి 20మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. హెచ్ఎం సత్తెయ్య, ఉపాధ్యాయులు దివ్యను అభినందించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకత వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సుగుణ సాహితీ సమితి నిర్వాహకుడు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


దివ్యకు బహుమతిని అందజేస్తున్న మాధవరెడ్డి

రాజీనామాలు కొత్తకాదు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్

సిద్దిపేటజోన్: తెలంగాణ ఉద్యమకారులకు పదవులు కొత్తకాదని హరీశ్‌రావు ఎన్నోసార్లు ఉద్యమం కోసం ఎమ్మెల్యే, మంత్రి పదవులకు రాజీనామా చేశారని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాం అన్నారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ రైతుల ఖాతాల్లో డబ్బులు పడే వరకు కాంగ్రెస్ మాట మీద ప్రజల్లో నమ్మకం లేదన్నారు. కనీస అవగాహన లేకుండా కాంగ్రెస్ చోటామోటా నాయకులు హరీశ్‌రావును రాజీనామా చేయాలని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. రెండు లక్షల రుణమాఫీతో పాటు ఆరు గ్యారెంటీలను, 13 హామీలను అమలుచేస్తే రాజీనామా చేస్తామన్నారని గుర్తుచేశారు. రుణమాఫీ మీద వెంటనే విధివిధానాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు సుందర్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు